# శిలాక్షరాలు

-పులిపాక కనకదుర్గ

కారు మెత్తగా సాగిపోతోంది. బెంజ్ కారులో ప్రయాణం విలాసవంతంగానూ, అంతకుమించి సౌకర్యంగానూ ఉంది. పక్కసీటులో ఐశ్వర్య.

నీలంరంగు జరీ బోర్డనున్న కెంపురంగు కాంజీవరం చీరలో రాశిపోసిన సౌందర్యంలా ఉంది. తెల్లని మేని ఛాయతో పోటీ పడుతున్నట్టున్న డైమండ్ నెక్లెస్ శంఖంలాంటి మెడకు అలంకారం అయినందుకు అతిశయంగా ఫీలవుతోంది. ముంజేతికున్న రవ్వల గాజులు, గోరింటాకుతో పండిన తమలపాకుల్లాంటి అరచేతులు సౌకుమార్యాన్ని పరీక్షించడానికి మాటిమాటికీ చేస్తున్న చిరుసవ్వడి మంజులనాదంలా ఉంది. సన్నని నడుముని చుట్టివున్న మువ్వల అలంకారం మీద మటుకు చిరుకోపం కలిగింది శ్రీనివాస్‌కు. పిడికెడంత నడుము మువ్వల భారాన్ని మోయలేనంటూ మొర పెట్టుకుంటున్నట్లుగా తోచింది శ్రీనివాస్‌కు.

భరోసా ఇస్తున్న నెపంతో బలమైన చెయ్యితో ఐశ్వర్య నడుముని చుట్టేసి తన అధీనంలోకి తెచ్చుకున్నాడు శ్రీనివాస్.

శ్రీనివాస్ ఆకస్మిక చర్యకు ఐశ్వర్య నునుపయిన చెంపలు సిగ్గుదొంతరల మధ్యన అరుణిమను సంతరించుకున్నాయి.

అందమైన పెద్ద కళ్లు బరువుగా క్రిందకు వాలిపోతే గులాబీరేకుల్లాంటి అధరాలు బెదురుతో కంపించడం గమనించిన శ్రీనివాస్ అల్లరిగా నవ్వుకున్నాడు.

ఎంఏ సైకాలజీలో గోల్డ్‌మెడలిస్ట్, సంపన్న కుటుంబానికి చెందిన ఆధునిక యువతి అయిన ఐశ్వర్య తన సమక్షంలో టచ్‌మినాట్‌లా ముడుచుకుపోతుంటే ముచ్చటగా అనిపించింది. 'అన్ని రంగాలలో ముందంజ వేస్తున్నా భర్త సమక్షంలో నునుసిగ్గుదొంతరల మధ్యన ఒద్దికగా ఉండడం భారత స్త్రీకి మాత్రమే సొంతమయిన ప్రత్యేకత' మురిపెంగా తలపోసాడు శ్రీనివాస్. మొదట ఈ ప్రయాణం శ్రీనివాస్‌కు సుతరామూ ఇష్టంలేదు. కానీ ఇప్పుడు అందాలరాశి అయిన అర్ధాంగితో కారులో షికారు శ్రీనివాస్‌కు అమితమైన ఉల్లాసాన్ని, పరవశాన్ని కలిగిస్తోంది.

వారంరోజులయింది వారి ఇరువురికీ అంగరంగ వైభవంగా వివాహం జరిగి. చిన్నతనంలో తాము కష్టకాలంలో ఉన్నప్పుడు ఆదరించి, ఆదుకున్న కృష్ణప్రసాద్‌గారి ఆశీస్సులు తాము తప్పనిసరిగా పొందాలన్న కన్నతల్లి కోరికను తిరస్కరించలేక మన్నించినందున ఇదిగో ఇప్పుడీ ప్రయాణం.

అందరితోపాటు కృష్ణప్రసాద్‌గారికి కూడా ఆహ్వానం పంపించడం జరిగింది. ఆరోగ్యరీత్యా ఆయన రాలేక ఫోన్‌లోనే ఆశీస్సులు అందజేసారు. అయినా శ్రీనివాస్ తల్లి మనసు తృప్తి చెందలేదు. స్వయంగా వెళ్లి కృష్ణప్రసాద్‌గారి ఆశీస్సులు పొంది రమ్మని ప్రయాణానికి ఏర్పాట్లు చేయించింది.

వాస్తవానికి శ్రీనివాస్‌కు కృష్ణప్రసాద్‌గారి దగ్గరకు వెళ్లడానికి మనస్సు అంగీకరించలేదు. పది సంవత్సరాల క్రితం చేదు అనుభవం మదినుండి మరుగున పడలేదు.

తల్లి బలవంతం, దానికి ఐశ్వర్య తండ్రి వత్తాసు పలకడంతో కృష్ణప్రసాద్‌గారింటికి ప్రయాణం అవక తప్పలేదు.

కారు పల్లెబాట పట్టిందనడానికి నిదర్శనంగా రోడ్డుకు రెండువైపులా పచ్చని చేలు నూతన దంపతులను స్వాగతిస్తున్నట్లుగా చిరుగాలికి అల్లల్లాడుతున్నాయి.

పచ్చని కొబ్బరిబోండాలు కనిపించగానే కారును రోడ్డువారగా ఆపాడు శ్రీనివాస్. కొద్దిసేపు ప్రకృతి వీక్షణంలో సేదతీరి తిరిగి ప్రయాణమయ్యారు.

ప్రయాణ బడలికవల్ల శ్రీనివాస్ భుజంమీద తలవాల్చి నిద్రలోకి జారుకుంది ఐశ్వర్య. ఒకచేత్తో ఐశ్వర్యను దగ్గరగా పొదువుకుని మరో చేత్తో జాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తూ గమ్యస్థానం దిశగా నడిపించసాగాడు శ్రీనివాస్.

ఐశ్వర్య మెత్తని స్పర్శ మైమరపుని కలిగిస్తుంటే మనసు మటుకు అనేక సందేహాలతో సతమతవుతోంది శ్రీనివాస్‌కు.

కృష్ణప్రసాద్‌గారు తమను ఎలా రిసీవ్ చేసుకుంటారోనన్న సందేహం అతనిని పీడించసాగింది. ఒకవేళ సరిగ్గా రిసీవ్ చేసుకోకపోయినా ఫర్వాలేదు, తను తట్టుకోగలడుగానీ ఐశ్వర్య తట్టుకోగలదా? ఆమె మనసు నొచ్చుకుంటే తను సహించగలడా? అయినా ఏనాడో మాసిపోయిన చెలిమికి తల్లి అంత ప్రాధాన్యత ఇచ్చి తమని ఇంతలా ఇబ్బంది పెట్టడం శ్రీనివాస్‌కు నచ్చలేదు. ఒకప్పుడు కృష్ణప్రసాద్‌గారు తమను ఆదుకున్న మాట వాస్తవమే. కానీ అదంతా గతం. వర్తమానంలో ఆయన మిగిల్చిన చేదు అనుభవాలు మాత్రమే మదిలో మిగిలివున్నాయి.


★★★

పచ్చదనానికి ఆలవాలం మువ్వలపాలెం. ఎక్కడ చూసినా పచ్చనిచేలు, ఏ ఇంట చూసినా ఏపుగా పెరిగిన కొబ్బరిచెట్లు, విరగబూసిన, విరబూసిన మందారాలు, నందివర్ధనాలు. మువ్వలపాలెంలో పేరు మోసిన డాక్టర్ కృష్ణప్రసాద్‌గారు. ఆయన కొడుకు సురేంద్ర, శ్రీనివాస్ సమవయస్కులు. సురేంద్ర సిటీలో ఉన్న రెసిడెన్షియల్ స్కూల్లో చదువుకుంటుంటే, శ్రీనివాస్ ఊర్లోని హైస్కూల్‌లో చదువుకుంటున్నాడు. శ్రీనివాస్ తండ్రి వెంకటాద్రి, కృష్ణప్రసాద్‌గారి దగ్గర కాంపౌండర్. శ్రీనివాస్ తల్లి భ్రమరాంబ డాక్టర్‌గారింట్లో వంటపని నిమిత్తం అడపాతడపా సాయం చేయడానికి వెళ్లేది.

కృష్ణప్రసాద్‌గారి భార్య వసుంధర ఉత్తమ ఇల్లాలు. శ్రీనివాస్ పట్ల ఎంతో ఆదరం కనబరిచేది. ముద్దుల మూటగడుతూ చదువులో చురుకుగా ఉండే శ్రీనివాస్ అంటే కృష్ణప్రసాద్ దంపతులకు ఎక్కడలేని ఆదరం.

కాలం సాఫీగా నడుస్తోంది. శ్రీనివాస్ పదేళ్లవాడయ్యాడు.

ఆ రోజు శ్రీనివాస్ జీవితంలో అత్యంత విషాద సంఘటన. చిన్నారి శ్రీనివాస్‌ని కష్టాల సుడిగుండంలోకి త్రోసివేసిన దురదృష్టకరమైన రోజు. శ్రీనివాస్ తండ్రి వెంకటాద్రి ఆకస్మిక మరణం అతని కుటుంబాన్ని దిక్కుతోచని స్థితిలో పడవేసినరోజు.



కృష్ణప్రసాద్‌గారే బాధ్యత వహించి శ్రీనివాస్ చేత కర్మకాండ అంతా దగ్గరుండి జరిపించారు.

***

భారంగా మరికొద్ది రోజులు గడిచిపోయాయి. శ్రీనివాస్ చదువు ప్రశ్నార్థకమయింది. అలాంటి సమయంలోనే వసుంధర, భ్రమరాంబను చూసిపోదామని వచ్చింది. పేదరికం తాండవిస్తున్న ఆ ఇంటిని చూస్తుంటే వసుంధర హృదయం కలుక్కుమంది. భ్రమరాంబ అయితే సర్వం కోల్పోయినదానిలా ఉంది.

“ఏమ్మా భ్రమరా! నువ్వే అలా డీలా పడితే ఎలా? శ్రీనివాస్ చూడు ఎంతగా దిగులు పడుతున్నాడో! స్కూలుకు కూడా వెళ్లన్నట్టులేదు. తల్లివి నువ్వే మనసు కుదుటపరచుకుని వాడి బాగోగులు చూడకపోతే ఎవరు చూస్తారు చెప్పు.”

వసుంధర అనునయ వాక్యాలకు పొంగుకొస్తున్న దుఃఖాన్ని పెదవిమాటున నొక్కిపెట్టింది భ్రమరాంబ.

ఎప్పుడే సాయం కావాల్సివచ్చినా మొహమాట పడకుండా అడగమని చెప్పి మరికొద్దిసేపు ఉండి వెళ్లిపోయింది వసుంధర.

***

మరికొద్దిరోజులకు భ్రమరాంబ అన్నయ్య వారిని తనతోపాటు బాపట్ల తీసుకెళ్లడానికి వచ్చాడు. మువ్వలపాలెం విడిచిపెట్టడం శ్రీనివాస్‌కు సుతరామూ ఇష్టంలేదు.

కృష్ణప్రసాద్ దంపతులు కూడా వారిని అక్కడే ఉండిపొమ్మని ఎంతగానో నచ్చచెప్పారు.

"బాబుగారూ! ఇప్పటికే మీ కుటుంబానికి ఎంతగానో రుణపడి ఉన్నాము. తండ్రి తరువాత శ్రీనివాస్ బాధ్యత మేనమామదే. మీ ఆదరణకు కృతజ్ఞురాలిని. ఈ విషయంలో నన్ను మన్నించండి" నమ్రతగా అంది భ్రమరాంబ.

ఆమె అన్నావదినెలను వెంకటాద్రి కర్మకాండల సమయంలో బాగా గమనించారు కృష్ణప్రసాద్‌గారు.

జరిగే తతంగంతో తమకేవిధమైన సంబంధం లేనట్టుగా, అంటీ అంటనట్టుగా ఉన్న వాళ్ల ధోరణి ఆయనకు ఎంతమాత్రం నచ్చలేదు. కేవలం లోకం కోసం వాళ్ల బాధ్యతను స్వీకరిస్తున్నాడే తప్ప అలాంటి వ్యక్తి ప్రాపకంలో భ్రమరాంబ, శ్రీనివాస్ ఇమడలేరని ఆయన నిశ్చితాభిప్రాయం. అందుకే ఆయన మరోమారు భ్రమరాంబతో చెప్పారు.

"చూడమ్మా భ్రమరా! నువ్వు మీ అన్నయ్య దగ్గరకు వెళ్తున్నా ఈ అన్నయ్య కూడా ఉన్నాడని మర్చిపోకు. నీకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా మేమున్నామని మరువకు. మీకోసం మా వాకిలి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి."

***

క్రిష్ణప్రసాద్‌గారి అంచనా తప్పు కాలేదు.

వచ్చిన మొదటిరోజు నుంచే భ్రమరనూ, శ్రీనివాస్‌ను ఈసడించుకోవటం మొదలుపెట్టింది భ్రమర వదిన.

తన కొడుక్కి రుచికరమైన కూరలతో, కమ్మటి పెరుగుతో భోజనం వడ్డించి, శ్రీనివాస్‌కు పచ్చడి మెతుకులు పెట్టేది.

ఇది చాలదన్నట్టు వెళ్లిన కొద్ది నెలలకే శ్రీనివాస్ చదువు మాన్పించి ఎరిగిన వారింట పాలేరు పనికి పెట్టాలని ప్రయత్నించింది.

భ్రమర తల్లి హృదయం తల్లడిల్లిపోయింది.

శ్రీనివాస్‌కు చదువు మీద మక్కువ ఎంత ఎక్కువో ఆమె తల్లి మనసుకు తెలియంది కాదు.

అందుకే కడుపు తీపితో అన్నతో విభేదించి శ్రీనివాస్‌ను తీసుకుని తిరిగి మువ్వలపాలెం చేరుకుంది.

కొడుకుతో సహా తిరిగి వచ్చిన భ్రమరాంబను క్రిష్ణప్రసాద్ దంపతులు ఎప్పటిలాగే ఆదరించారు.

శ్రీనివాస్‌ను ఉచితంగా తమ ఖర్చుతో చదివిస్తామని అన్నా భ్రమరాంబ అంగీకరించలేదు. ఎక్కడయినా, ఏ చిన్నపనయినా చూపించమని వారిని కోరింది.

భ్రమరాంబ మాటను కాదనలేక ఆమెకు వంటమనిషిగా తమ ఇంటిలోనే ఆశ్రయమిచ్చారు క్రిష్ణప్రసాద్ దంపతులు.

శ్రీనివాస్‌ని ఇదివరకటి స్కూల్లోనే చేర్పించింది భ్రమరాంబ.

చదువులో చురుకుగా ఉండే శ్రీనివాస్ ఎప్పటిలాగే అన్ని క్లాసులూ ఫస్టన పాసయ్యేవాడు.

ఇహ భ్రమరాంబ, వసుంధర ఒక తల్లిబిడ్డల్లాగే కలిసిపోయేరు. భ్రమరకు మొదటి నుంచి మొక్కలంటే అమితమైన ప్రేమ.

విశాలమైన క్రిష్ణప్రసాద్‌గారి ఆవరణను నందనవనంలా తీర్చిదిద్దింది భ్రమర.

ఇంటికి ముందువేపున మల్లెలు, మందారాలు, గులాబీలు, చేమంతులు ఇంటికి అందాన్ని తీసుకు వస్తే, వెనకవేపు పెరట్లో చిక్కుడు, సొర, పొట్లకాయ పాదులూ, వంకాయ, క్యాబేజీ, టమోటా చెట్లు ఇంటికి కావల్సిన తాజా కూరగాయలు అందించేవి. ఇవేకాక పాలకూర, తోటకూర మళ్లూ, పచ్చిమిరపకాయలు, కరివేపాకు మొక్కలూ, కొత్తిమీర, మెంతికూరలను కూడా ఇంట్లోనే పెంచేది భ్రమర.


ఎప్పటికప్పుడు ఇంటిని అద్దంలా శుభ్రంగా ఉంచేది. పేరుకు వంటమనిషే అయినా వసుంధరను ఏ చిన్న పనీ ముట్టుకోనిచ్చేది కాదు. ఇవి చాలవన్నట్టు సిటీలో ఉండి చదువుకుంటున్న సురేంద్రకు తరచూ ఏవో తినుబండారాలు చేసి పంపేది.

శ్రీనివాస్ కూడా ఇంటికి అవసరమైన బయట పనులన్నీ చేసి పెట్టేవాడు.

"ఎందుకమ్మా ఈ పనులన్నీ మీరు చేయటం. వేరే ఎవరికయినా చెప్పొచ్చు కదా" అనేవారు క్రిష్ణప్రసాద్‌గారు.


"నన్ను సొంత తోబుట్టువు కంటే ఎక్కువగా ఆదరిస్తున్నారు. ఏం చేసినా మీ ఋణం తీరదు. ఈ కాస్తయిన చెయ్యనివ్వండి" వినమ్రంగా బదులిచ్చేది భ్రమరాంబ.

స్వంత మనిషి కంటే ఎక్కువగా బాధ్యతలు పంచుకుంటున్న భ్రమరాంబను పరోక్షంగా అభినందించటం మినహా ఏమీ చేయలేక మిన్నకుండిపో



## హిట్ కాంబినేషన్

సదా-నితిన్ జంటగా నటించిన 'జయం' ఘనవిజయం సాధించింది. ఆ తరువాత మళ్లీ ఇద్దరూ ఇంతదాకా నటించలేదు. మళ్లీ ఇన్నాళ్లకి 'టక్కరి' సినిమాలో సదా-నితిన్ జంటగా నటిస్తున్నారు. ముందు ఈ చిత్రంలో హీరోయిన్‌గా సుహానీని అనుకున్న నిర్మాతలు ఆ తరువాత సదాను తీసుకున్నారు. నితిన్-సదాల హిట్ కాంబినేషన్ 'టక్కరి'లోనూ వర్కవుట్ అవుతుందేమో చూడాలి. ఆల్ ది బెస్ట్.



యేరు క్రిష్ణప్రసాద్‌గారు.

శ్రీనివాస్ చదువులో అన్నింటా ఫస్టున పాస్ అవుతూ దినదినప్రవర్ధమాను డవుతున్నాడు.

క్రిష్ణప్రసాద్‌గారికున్న ఒక్కటే లోటు కన్నకొడుకు తెలివితేటలు. కొడుకును తనంత డాక్టర్‌ని చెయ్యాలన్నది క్రిష్ణప్రసాద్‌గారి తాపత్రయం. సురేంద్ర అందుకు విరుద్ధంగా ఉండేవాడు.

బాగా చదువుకోవాలన్న తాపత్రయం అతనికి ఇసుమంతయినా లేదు. చదువు మీద శ్రద్ధ లేదు.

ఇహ తెలివితేటలూ అంతంతమాత్రమే. అన్ని తరగతులలోనూ అతనివి అత్తెసరు మార్కులే.

సురేంద్ర చదువు క్రిష్ణప్రసాద్‌గారికి తీరని మనోవ్యధని కలిగిస్తున్నది.

ఎవరితో ప్రమేయం లేనట్టుగా మరొక రెండు సంవత్సరాలు గడిచిపో యేయి.

శ్రీనివాస్ ఇంటర్ స్టేట్‌ర్యాంకుతో పాసయ్యాడు. అంతేగాదు మెడిసిన్‌లో మంచి ర్యాంకుతో సీటు కూడా వచ్చింది.

ఆనందంతో, ఉరుకులు పరుగుల మీద గాలిలో తేలిపోతూ ఇంటికి వచ్చేడు శ్రీనివాస్.

ఎప్పుడెప్పుడు ఈ వార్త తల్లికి, క్రిష్ణప్రసాద్‌గారికి చెప్పుదామా అన్న తహ తహతో ఉన్నాడు.

సురేంద్ర ఇంటర్ తప్పటంతో అప్పటికే కృంగిపోయి ఉన్నారు క్రిష్ణప్రసాద్ గారు.

ఆనాడు శ్రీనివాస్ విజయం ఎందుకనో ఆయనలో అమితమైన ద్వేషాన్ని కలిగించింది.

నిష్కారణంగా అనవసరపు నెపం మీద శ్రీనివాస్‌ని నలుగురి ముందు అవ మానించారు.

పెద్దలను మన్నించటం రాదంటూ శ్రీనివాస్‌ను దుర్భాషలాడి, మరొకసారి తన కంట పడవద్దని శ్రీనివాస్‌ని బయటకు గెంటేశారు.

జరిగిన దానికి భ్రమరాంబ, వసుంధర ఎంతగానో నొచ్చుకున్నారు.

శ్రీనివాస్ మటుకూ జరిగిన అవమానాన్ని మర్చిపోలేకపోయాడు. ఇక జన్మలో క్రిష్ణప్రసాద్‌గారి మొహం చూడకూడదని నిర్ణయించుకున్నాడు. మెడి సిన్ చదవటానికి సిటీకి వచ్చిన శ్రీనివాస్ తిరిగి మువ్వలపాలెం వెళ్లలేదు. హాస్టల్లో ఉంటూ అక్కడే చదువుకున్నాడు. భ్రమరాంబ ఎంత నచ్చచెప్పినా శ్రీనివాస్ తన మనసు మార్చుకోలేదు.భ్రమరాంబ మువ్వలవానిపాలెంలోనే ఉండిపోయేరు.

***

విశ్వనాధరావుగారు శ్రీనివాస్ చదువుకుంటున్న మెడికల్ కాలేజీలో ప్రొఫె సర్. శ్రీనివాస్ తెలివితేటలు ఆయనను ఎంతగానో ఆకర్షించేయి. శ్రీనివాస్ ఆర్థిక దైన్యస్థితి తెలుసుకున్న ఆయన శ్రీనివాస్ చదువు పూర్తవ్వటానికి కావ ల్సిన ఆర్థిక సాయం అందజేశారు.

ఐశ్వర్య విశ్వనాధరావుగారి ఒక్కగానొక్క అమ్మాయి. రాశి పోసిన సౌందర్యం ఐశ్వర్య.

వారి పరిచయం క్రమంగా ప్రేమగా మారింది. పెద్దల అంగీకారం లభించ టంతో పెళ్లికి గ్రీన్ సిగ్నల్ దొరికినట్లయ్యింది.

ఎం.బి.బి.ఎస్. పూర్తి చేసిన తరువాత యు.ఎస్‌లో ఎం.ఎస్. పూర్తి చేసు కుని వచ్చేడు శ్రీనివాస్.

అన్ని విధాల తన ఉన్నతికి తోడ్పడిన ఐశ్వర్య.అంటే ప్రాణం, విశ్వనాధరా వుగారంటే అమితమైన గౌరవం శ్రీనివాస్‌కు.

ఇండియాకు వచ్చిన తరువాత మంచి డాక్టరుగా పేరు తెచ్చుకున్నాడు శ్రీనివాస్.

తల్లిని కూడా తన దగ్గరకు రప్పించుకున్నాడు.

***

గతం నుంచి వర్తమానంలోకి వచ్చేడు శ్రీనివాస్.

క్రిష్ణప్రసాద్‌గారు ఆనాడు చేసిన అవమానం ముల్లులా గుచ్చుతూనే ఉంది అతనిని ఇంకా.

గమ్యస్థానం చేరుకున్న వెంటనే హృదయ స్పందన పెరగటం గమనిం చేడు శ్రీనివాస్.

తమను క్రిష్ణప్రసాద్‌గారు ఎలా రిసీవ్ చేసుకుంటారో అన్న సంకోచం అత నిని వీడటం లేదు.

ఐశ్వర్య చేయిని అందుకుని లోనికి ప్రవేశించేడు.

శ్రీనివాస్‌ను ముందర గుర్తించలేదు క్రిష్ణప్రసాద్ దంపతులు.


## మల్లాకంభ్

మహారాష్ట్రలో అనాది నుంచి మల్లాకంభ్ అనే ఆటని కొందరు సాధన చేస్తున్నారు. దీన్ని పగ్గాలమీద యోగా అని కూడా అనవచ్చు. ఒక గ్రూపు జర్మనీ, సింగపూర్, దేశాలకు వెళ్లి ప్రదర్శనలిచ్చారు. ఆ ప్రదర్శనలకు అక్కడ బాగా ఆదరణ లభించడంతో అమెరికాకు వెళ్లారుట. ఇటీవల వారు న్యూమెక్సికోలో నిర్వహించిన క్యాంపులో వందమంది అమెరికన్లు పాల్గొన్నారుట. తక్కువ సమయంలో ఎక్కువ వ్యాయామం దొరికే ఆట మల్లాకంభ్ అని అంటున్నారు కోచ్ ఉదయ్ దేశ్‌పాండే. మన దేశంలో ఈ ఆటని నిత్యసాధన చేసేవాళ్లు 10.000 మందిదాకా ఉన్నారట.

## అంతా తేనెమయం...

ఒరిస్సాలోని బంజిపాలీ అనే ఆదివాసి గ్రామంలో మనుషులు త్రాగడానికి సరిపడా నీళ్లలేవుగానీ ఎక్కడపడితే అక్కడ తేనెపట్టులు ఉండడంవల్ల తేనె మాత్రం సమృద్ధిగా దొరుకుతోందిట. గ్రామస్థులకి పంచదార, బెల్లం అవసరమే రావడంలేదుట. 150మంది జనాభాగల ఆ గ్రామంలో ప్రతి కుటుంబం నెలకి 20 లీటర్ల తేనెని సేకరించగలుగుతోంది. తరచూ తేనె త్రాగడంవల్ల ఎవరికీ జబ్బులనేవి లేవుట. ఒక ఏడాదికి 100 లీటర్ల తేనెని వాళ్లు మార్కెట్‌లో అమ్ముతారుట.

-తటవర్తి



గుర్తించిన వెంటనే శ్రీనివాస్‌ని ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నారు క్రిష్ణ ప్రసాద్‌గారు.

శ్రీనివాస్‌కిది ఊహించని పరిణామం.

నూతన దంపతులకు ఘనమైన సత్కారం లభించింది.

క్రిష్ణప్రసాద్ దంపతుల ఆదరాభిమానాలకు ఉక్కిరిబిక్కిరి అయ్యేరు శ్రీనివాస్, ఐశ్వర్యలు.

సురేంద్ర దంపతులు కూడా ఆప్యాయంగా రిసీవ్ చేసుకున్నారు. సురేంద్ర ఏదో మంచి బిజినెస్‌లో సెటిలయ్యేడట.

తాము తెచ్చిన పట్టుబట్టలు క్రిష్ణప్రసాద్ దంపతులకి పెట్టి నమస్కరించారు శ్రీనివాస్, ఐశ్వర్యలు. ఆశీర్వచనంతో పాటు తామూ నూతన దంపతులకు కొత్త బట్టలు బహూకరించేరు క్రిష్ణప్రసాద్ దంపతులు.

వారి ఆతిథ్యం స్వీకరించి తిరుగుప్రయాణమయ్యేరు శ్రీనివాస్, ఐశ్వర్యలు.

★★★

శ్రీనివాస్ మనసు నిండా సమాధానం లేని ప్రశ్నలే.

"ఎంతో మంచిగా ఉండే క్రిష్ణప్రసాద్‌గారు ఆనాడు ఎందుకు నిష్కారణంగా తనను అంతగా అవమానించారు?"

'అసలు తనను లోనికి రానిస్తారో లేదో అన్న సంకోచంలో ఉన్న తనకు అసలు గతంలో చేసిన అవమానం భ్రమేమో అనిపించేంతగా ఈనాడు ఎందుకు ఆదరించారు?'

అంతా గందరగోళంగా అనిపించింది శ్రీనివాస్‌కు.

ఐశ్వర్య కూడా శ్రీనివాస్‌ను నిశితంగా గమనిస్తున్నది.

మనిషి ప్రసన్నంగా ఉన్నాడు. కానీ అంతలోనే ఏదో దీర్ఘాలోచనలో మునిగినట్టు అనిపించింది.

పక్కన ఐశ్వర్య ఉనికిని సైతం విస్మరించి తమదైన ఆలోచనలో ఉండిపోయేడు శ్రీనివాస్.

ధైర్యం చేసి పలకరించింది ఐశ్వర్య.

చిరునవ్వుతో ఐశ్వర్యను పరికించేడు శ్రీనివాస్.

"ఉన్నట్టుండి ఎందుకలా కామ్ అయిపోయేరు?" మృదువుగా ప్రశ్నించింది ఐశ్వర్య శ్రీనివాస్‌ని మరొకసారి.

తన అంతరంగంలోని ఆలోచనలని అర్థాంగితో పంచుకున్నాడు శ్రీనివాస్.

"ఇందులో అర్థం కాకపోవటానికి ఏముంది? మీ చిన్ననాటి దైన్యస్థితి క్రిష్ణప్రసాద్‌గారిని కరిగించి ఉంటుంది. పైగా మీకు సాయం చేసి తన ఔదార్యాన్ని చాటుకోవాలన్న తాపత్రయమూ మరి లోతుల్లో ఏ మూలనో ఉండి ఉంటుంది. అదీకాక మీ కుటుంబం మీద ఉన్న సాఫ్ట్‌కార్నర్, జాలి కూడా మీకు సాయపడేలా చేశాయి. కానీ ఎప్పుడయితే మీకు మెడిసిన్‌లో సీటు వచ్చిందో తనతో సమానమవుతున్నందుకు, తన కన్నకొడుకు కంటే మిన్నగా మీరున్నందుకు ఆయనలో తెలియని అసూయ కలిగింది. క్రిష్ణప్రసాద్‌గారిలో అసూయే మిమ్మల్ని అవమానించటానికి కారణమయ్యింది. ఇహ ఇప్పుడంటారా మీరు అన్నింటా ఆయన కన్నా అధికులు. అధికులతో పరిచయం ఎవరికయినా గర్వకారణం. కాలం అన్నింటికన్నా గొప్పది. అది ఎవరిలో ఎలాంటి మార్పునయినా తీసుకువస్తుంది. ఆ కాలమే క్రిష్ణప్రసాద్‌గారిలో అసూయని నశింపజేసి మంచి మార్పును తీసుకువచ్చింది. అందుకే ఆయన మనల్ని అంత చక్కగా ఆదరించారు" వివరంగా చెప్పుకొచ్చింది ఐశ్వర్య.

ఐశ్వర్య ఎనాలిసిస్‌కు ముగ్ధుడయ్యేడు శ్రీనివాస్.

"నువ్వు చెప్పిందంతా వాస్తవమే ఐశ్వర్యా. కానీ క్రిష్ణప్రసాద్‌గారు మాకెంతో సాయం చేశారు. ఆయనే లేకపోతే నేనీరోజు ఇంత మంచి స్థితిలో ఉండేవాడిని కాదు.క్షణికావేశంలో ఆయన చేసిన అవమానాన్ని వయసు ఆయన కంటే చిన్నవాడినయిన నేను అంతగా గుర్తు పెట్టుకుని ఉండాల్సింది కాదు. ఆయన చేసిన మంచి ముందు చేసిన అవమానం ఒక రకంగా చిన్న విషయం. నేను కూడా అంతగా ఆవేశపడి ఉండాల్సింది కాదు." పశ్చాత్తాపం ధ్వనించింది శ్రీనివాస్ స్వరంలో.

"నిజమే ఒక మనిషి చేసిన మంచిని ఎప్పటికీ గుర్తుంచుకోవాలి. చెడుని వీలయినంత త్వరగా మర్చిపోవాలి. అప్పుడే ఈ ద్వేషాలు, కక్షలు, రక్తపాతాలు ఏవీ ఉండవు" శ్రీనివాస్‌తో ఏకీభవిస్తూ అంది ఐశ్వర్య.

"అందుకే అంటారు ఐశ్వర్యా! ఎవరయినా చెరుపు చేస్తే ఇసుక మీద రాతలుగా రాయమని. ఎందుకంటే ఇసుక మీద రాతలు త్వరగా చెరిగిపోతాయని. అదే ఎవరయినా మంచి చేస్తే దాన్ని శిలాక్షరాలుగా రాయమంటారు. ఎప్పటికీ చెరిగిపోకుండా పదిమందికి స్ఫూర్తిని కలిగిస్తాయని" స్టీరింగ్ మీద నుంచి దృష్టిని మరల్చకుండా అన్నాడు శ్రీనివాస్.

నవదంపతుల భావి జీవితంలా మార్గం కూడా చుట్టూ పచ్చని చేలతో, స్మూత్‌గా ఉంది.

★



## ఆయేషా ఆనందం

తెలుగులో ఘనవిజయం సాధించిన 'పోకిరి'ని బోనీకపూర్ హిందీలో 'వాంటెడ్ డెడ్ అండ్ అలైవ్' పేరుతో నిర్మిస్తున్నాడు. ఇందులో హీరో సల్మాన్ ఖాన్ పక్కన హీరోయిన్‌గా ఆయేషా టకియాని ఎన్నిక చేశాడు. కంగనా రనౌత్, దీపికా పదుకొనే లాంటి కుర్ర భామల పేర్లు కూడా పరిశీలించిన బోనీ చివరికి ఆయేషా అయితే బావుంటుందని నిర్ణయించుకున్నాట్ట. సల్మాన్ ఖాన్‌తో ఈ సినిమా ద్వారా తొలిసారిగా నటిస్తున్న ఆయేషా తనకి ఇంత మంచి అవకాశం వచ్చినందుకు తెగ ఆనందపడిపోతోంది.

